# జీవితానికి దూరంగా...

చీటికీ మాటికీ కలల్లోకి జారిపోయేందుకూ.., పెదవులపైకి అదేపనిగా చిరునవ్వు పాకేందుకూ.., హడావుడిగా పరుగులు తీసేందుకూ, అంతలోనే పరధ్యాసగా నిలబడిపోయేందుకూ.. సునంద వయసు పదహారు కాదు.. నలభై ఆరు.

తను మరీ బయటపడిపోతూందనీ, ఆనందాన్ని దాచుకోలేకపోతోందనీ ఆమెకి తెలుస్తోంది. ఆ సంతోషాన్ని చూసి అందరూ ఈర్ష్య పడతారేమో, దిష్టి తగుల్తుందేమో అని మరోప్రక్క భయంగా కూడా వుంది.

కానీ నిగ్రహించుకోవడం ఆమె వల్ల కావడం లేదు.

ఈరోజే పుట్టినట్లూ.. ఈరోజే యవ్వనంలో అడుగుపెట్టినట్లూ.. ఈరోజే భగవంతుడు పిలిచి "ఇదిగోనమ్మా సునందా!" అంటూ తన జీవితాన్ని తన చేతుల్లో పెట్టినట్లూ అనిపిస్తోంది ఆమెకి.

అవును. పుట్టి నలభై ఆరు ఏళ్ళయినా యిన్నాళ్ళూ సునంద జీవించలేదు.

"నా జీవితంలో ఆనందాన్ని యిచ్చినవి" అని చెప్పుకోగల సంఘటనలు ఆమెకి లేవు.

"నా జీవితంలో సన్నిహితమైన వాళ్ళు." అని చెప్పుకోగల వ్యక్తులు లేరు.

"నా జీవితంలో సాధించినవి" అని చెప్పుకోగల విజయాలూ లేవు.

నిజంగా ఆమెకివేమీ లేవు.

ఆమె పుడుతూండగానే ఆమె తల్లి చనిపోయింది. ఊహ తెలియకముందే సవతితల్లి ఆమె చేయందుకుంది.

ఆతర్వాత జీవితమంతా యిక ఆ సవతితల్లి వెనుక నడవడంలోనే గడిచిపోయింది.

తెల్లవారుఝామున నాలుగుగంటలకి నిద్రలేచేది సునంద. ఇంటికి నాలుగువైపులా ఊడ్చి, కలాపి చల్లి, ముగ్గులు పెట్టడంతో దినచర్య ప్రారంభమయ్యేది.

పాలు పితకడం.. అందరినీ లేపి కాఫీలివ్వడం, ఇంటెడు బట్టలూ ఉతకడం, అంట్లన్నీ వేసుకుని తోమడం..

సునందకి గడియారాలూ, రిస్ట్ వాచ్‌లూ తెలీవు. ఆమెకి తెలిసిందొకటే. తను పనిచేస్తూ వుంటే కాలం గడుస్తుంది. కాలం గడుస్తూ వున్నా తను పనిచేస్తూనే వుంటుంది.

ఇరవై ఏళ్ళు వచ్చేవరకూ అలాగే గడిచింది ఆమె జీవితం. ఆ ఇల్లు తప్ప మరో లోకం తెలీకుండా.. పని తప్ప మరో విషయం తెలీకుండా.

అప్పుడు.. పెళ్ళయ్యింది.

పెళ్ళి అవుతుందని తెలిసినపుడు, పెళ్ళి జరుగుతూన్నపుడు కూడా సునందకి కాలం నిర్లిప్తంగానే గడిచింది.

మొదటిరాత్రి.. శంకరం వున్న గదిలోకి అడుగుపెట్టబోతూ.. తలుపు దగ్గర ఒక్కక్షణం ఆగినపుడు..

అప్పుడు.. ఆ ఒక్కక్షణం మాత్రం సునంద జీవించింది.

అవును. ఆమె పుట్టాక ఆశ, ఉద్వేగం లాంటి భావాలు ఎప్పుడయినా అనుభవించిందంటే అది ఆ ఒక్కక్షణమే.

శరీరాన్ని చుట్టేసిన తెల్లచీర "వెళ్ళు. లోపల నీమనసును ప్రేమబంధంతో పెనవేసే స్నేహితుడున్నాడు" అని చెప్తుంటే,

జడలోని మల్లెలు "ఇకపై జీవితమంతా పరిమళభరితమేలే" అని ఆమె చెవిలో గుసగుసలాడుతుంటే, తనకి యిష్టమయినట్లుగా, తన ఆలోచనలకి తగినట్లుగా

తను జీవించబోయే కొత్త జీవితం.. చేతిలో వున్న పాలగ్లాసంత స్వచ్ఛంగా కనిపిస్తుంటే.. లోపలికి అడుగుపెట్టింది సునంద.

శంకరం కనిపించాడు. అర్ధమయ్యాడు. ఆమెలోని జీవం చచ్చిపోయేంతవరకూ మెల్లమెల్లగా అర్ధమయ్యాడు.

సునంద ఊహించినట్లుగా పెళ్ళయ్యాక జీవితం మారలేదు. ఆమె అత్తవారింటికి వెళ్ళలేదు. శంకరమే యిక్కడ వుండిపోయాడు.

అదే యిల్లు.., అదే పని.., కాకపోతే యిపుడు వాటికి తోడుగా బాధ్యత తెలియని భర్తా.. అతనికి చేయాల్సిన సేవలూ కూడా చేరాయి.

ఇంట్లో వుండేది నలుగురే మనుషులు. అయినా సునంద ఏదో ఒక పనితో రోజంతా సతమతమయ్యేలా శ్రద్ధ తీసుకునేది సుభద్రమ్మ.

తమ్ముడు హాస్టల్‌లో వుండేవాడు. సెలవుల్లో అతను యింటికి వస్తే యిక సునందకి వూపిరి తీసుకునే అవకాశం కూడా వుండేది కాదు. " రాజేష్‌కి అరిసెలంటే యిష్టం. రాజేష్‌కి కజ్జికాయలంటే యిష్టం" అంటూ అవన్నీ వండించేది సుభద్రమ్మ.

అవును మరి.. ఆవిడ సునందకి సవతితల్లి కానీ రాజేష్‌కి కన్నతల్లి.

తల్లిదండ్రుల ఆశలన్నీ రాజేష్ మీదే వుండేవి. శ్రద్ధగా చదివేవాడు రాజేష్. టెన్నిస్ ఆడేవాడు. ఎదుటివాళ్ళు దాసోహమనేటంత అద్భుతంగా ఫ్లూట్ వాయించేవాడు.

జీవితమంటే ఏమిటో అతనిలో కనిపించేది సునందకి. తను చనిపోయి తమ్ముడి శరీరంలోకి పరకాయప్రవేశం చేయాలనిపించేది.

ఇంజినీరింగ్ అయిపోగానే పైచదువులకి ఫారిన్ వెళ్ళిపోయాడు రాజేష్. ఆతర్వాత అక్కడే పెళ్ళి. అక్కడే ఉద్యోగం. తండ్రి చనిపోయినపుడు కూడా రాలేదు.

తండ్రి చనిపోవడానికి కొంచెం ముందు .. ఎప్పుడయినా అనిపించేది

సునందకి, "నాకూ ఒక కొడుకు పుడితే.." అని. మనవడిని ముద్దు చేసే తండ్రిని చూడాలని. తీరేదేనేమో ఆమె కోరిక! ఒక అర్ధరాత్రి.. సునంద నగలతో, బీరువాలో వున్న డబ్బుతో, రెడ్డిగారు వుంచుకున్న కామాక్షితో, శంకరం పారిపోయి వుండకపోతే.

శంకరం వూరొదిలి వెళ్ళిపోయాడని తెలిసినపుడు సునందకి దుఃఖం రాలేదు. డబ్బులూ, నగలూ తల్చుకుని సవతితల్లీ, తండ్రీ గుండెలు బాదుకుంటూంటే ఆమెకి అర్ధం కాలేదు. చివరికి, అతని గుర్తులుగా ఆమె వంటిమీద మిగిలిపోయిన దెబ్బలూ, వాతలూ కూడా ఆమెకి చిరాకు కలిగించలేదు.

అంతటి నిర్లిప్తత ఆవరించేసింది ఆమెని. ఒక నడక వచ్చిన యంత్రం లాగా, యావజ్జీవశిక్ష పడిన ఖైదీ లాగా తిరిగింది ఆమె ఆ యింట్లో.

పాతిక సుదీర్ఘమయిన సంవత్సరాలు..

ఎన్నో వసంతాలొచ్చాయి. హేమంతాలొచ్చాయి. ఎన్నో యిళ్ళు పసిపిల్లల కేరింతలతో పులకరించాయి. పెద్దవాళ్ళకి వీడ్కోలిచ్చి కన్నీళ్ళు కార్చాయి.

ఊర్లోకి హైస్కూల్ వచ్చింది. కాలేజ్ వచ్చింది. అమ్మాయిలు సైకిల్ తొక్కుకుంటూ కాలేజీలకి వెళ్ళే రోజులు వచ్చాయి. కానీ యివేవీ సునంద ప్రత్యక్షంగా చూడలేదు.

అవేకాదు. తండ్రి చనిపోయిన రెండేళ్ళకు కట్టిన శివాలయం.. ఈ యిరవైమూడేళ్ళలో ఒక్కసారికూడా సునంద చూడలేదు.

అసలు సునందకి ఏం తెలుసని! ఏమీతెలీదు. తల్లికేకకు వులిక్కిపడి పరుగెత్తడం.. యంత్రంలా పనిచేయడం తప్ప ఏమీ తెలీదు.

ఇప్పుడు సుభద్రమ్మ ఆరోగ్యం బాగా క్షీణించింది. మాటకూడా సరిగా రావడం లేదు. సునందకి రోజంతా ఆవిడ సపర్యలతోనే సరిపోతుంది.

స్థిమితంగా ఒక్కనిమిషం నిలుచునేందుకూ, ఆదమరచి ఒక్కక్షణం నిద్రబోయేందుకూ వుండదు.

తోటలోని కనకాంబరాలు మాలకట్టి, చిన్నికృష్ణుడి పటానికి వేయాలన్న కోరిక కూడా సునందకి రోజులతరబడి తీరదు.
ప్రక్కింట్లోని పసివాడిని ఎత్తుకుని ముద్దాడాలన్న ఆశ వారాల తరబడి ఆశగానే మిగిలిపోతుంది.
ఒక్కొక్కసారి ఆమెకి భయం వేసేది. "ఎన్నాళ్ళు చేయగలుగుతాను నేను ఈవిడకి! ఇంకో నాలుగురోజులుపోతే నన్నే ఎవరైనా చూడాల్సిన పరిస్థితి వస్తే అప్పుడెలా!" అన్న ఆలోచనతో.
కానీ అంతటి పరిస్థితి రాకముందే రాజేష్ ఆవిడని తీసుకెళ్ళిపోతున్నాడు. రాజేష్ దగ్గరనుంచి ఉత్తరం వచ్చినరోజునే సగం నిశ్చింత కలిగింది సునందకి. ఇపుడు.. ఆవిడ ఫారిన్ వెళ్ళే ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాక.. యింకా నిశ్చింతగా వుంది.
సుభద్రమ్మకి కూడా సునంద మీద ద్వేషం లేదిపుడు. తన సేవలతో ఆవిడప్రేమని జయించుకుంది సునంద. ఈ స్థితిలో కూడా ఆవిడ "సునందా!" అంటూ నీరసంగా ఒక కేక పెడితే చాలు, సునంద అంతెత్తున ఎగిరిపడుతుంది. "పిన్నీ" అంటూ పరుగెడుతుంది.
ఇంటినీ, బ్యాంకులో వున్న డబ్బునీ సునందకే వదిలేసింది ఆవిడ. అందుకు కొడుకుని వప్పించింది. బ్యాంకు నుంచి వచ్చే వడ్డీతో, యింటిమీద వచ్చే అద్దెతో సునంద హాయిగానే వుండచ్చు.
అవును. ఆవిడ వెళ్ళిపోతే అపుడు..
తనకి నచ్చినవి తను కొనుక్కోవచ్చు. తనకి కావలసినవి తను తినచ్చు. ఇష్టమయిన చోటికి వెళ్ళచ్చూ.. యిష్టమయిన వాళ్ళతో మాట్లాడచ్చు. తల్చుకుంటేనే చాలా ఆనందంగా వుంది సునందకి.
ఇంటికి దగ్గర్లో ఆశ్రమం వుంది. రోజూ అక్కడికి వెళ్ళాలి. రెండుగంటలసేపు వుండి పాటలు, భజనలు నేర్చుకుంటానని వాళ్ళకి ముందే చెప్పేసింది.

పాటలంటే ప్రాణం సునందకి. ఇప్పటివరకూ ఏరోజూ గొంతు విప్పి పాడుకునేందుకు అవకాశం వుండేది కాదు. సవతితల్లి ముందు మాట్లాడేందుకే ధైర్యం లేదు. ఇక పాటలెక్కడ!

పొద్దునపూట బావిదగ్గర కూర్చుని అంట్లు తోముతూంటే ప్రక్కనే వున్న గుడిలోనుంచి సుప్రభాతం వినపడేది. పండుగ వచ్చినా, పబ్బం వచ్చినా పాటలే పాటలు. అవి వింటూ వుంటే ఆనందంతోనూ, భరించలేనంత బాధతోనూ గుండె వణికిపోయేది. కళ్ళల్లోనుంచి దుఃఖం పొంగుకొచ్చేది.

తను మూగదైనా బాగుండేది. ఇంత బాధపడేది కాదు. కానీ మాటలొచ్చి కూడా.. యిలా దేనికీ స్వేచ్ఛ లేకుండా..

ఏనాడూ పాడకపోయినా, తను చాలా బాగా పాడగలనని, తనే పాటలు నేర్చుకుని వుంటే చాలాపేరు వచ్చివుండేదనీ సునందకి గట్టి నమ్మకం. ఆమె చిన్నప్పటినుండీ పెరుగుతూ వచ్చిన ఆ కోరిక యిన్నాళ్ళకి తీరబోతూంది.

ఆలోచిస్తూనే తయారయింది సునంద. తల్లినీ, ఆవిడ సామానునీ తీసుకుని బయల్దేరింది. సిటీలో రాజేష్ ఫ్రెండు వున్నాడు. వాళ్ళూ రాజేష్‌తోపాటు ఫారిన్‌లో వుండేవాళ్ళే. నెలరోజులక్రితం ఇండియా వచ్చారు, అందర్నీ చూసి వెళ్ళేందుకు.

వాళ్ళతో కలిసి వెళ్ళాలి సుభద్రమ్మ యిపుడు. ఆవిడని తీసుకువెళ్ళి, వాళ్ళకి అప్పచెప్పడంతో సునంద బాధ్యత పూర్తయింది. ఆదరంగా రిసీవ్ చేసుకున్నారు వాళ్ళు. "రేపు ప్రొద్దున వెళ్ళచ్చు. రాత్రికి యిక్కడ వుండండి." అన్నా సునంద వినలేదు. "లేదండీ, వెళ్ళిపోతాను." అంటూ వచ్చేసింది.

"ఎంతయినా పిన్నిని వదిలి వస్తుంటే చాలా బాధవేసింది. పాపం ఆవిడ కూడా తన చేతులు పట్టుకుని "జాగ్రత్తమ్మా!" అంది వణికే కంఠంతో" చిన్నగా నిట్టూర్చి కన్నీళ్ళు తుడుచుకుంది సునంద.

హడావిడిగా బస్‌స్టాప్‌కి వచ్చి లాస్ట్‌బస్ అందుకుంది. చల్లటిగాలి సర్వవేదనలనీ తరిమికొడుతోంది. స్వేచ్ఛ.. స్వేచ్ఛ. అటు ఆకాశం. ఇటు భూమి. మధ్యలో తను. అంతే. ఇంకేమీ లేవు. తనమీద ఎవరి ఆంక్షలూ లేవు. ఎవరితో సంబంధాలు లేవు. ఆనందం అణువణువునా గిలిగింతలు పెడుతోంది.

చిన్నప్పుడు శ్రీరామనవమి పందిట్లో ఒక సినిమా చూసింది సునంద. అందులో రాజకుమార్తె ఒక పేద అబ్బాయిని ప్రేమిస్తుంది. అతనిని తప్ప ఎవరినీ పెళ్ళి చేసుకోనంటుంది. కానీ రాజకుమార్తె కదా! అందుకే ఆ అబ్బాయిని.. ఆమె రాజ్యంలోని ఒక మామూలు అబ్బాయిని కూడా ఆమె పొందలేకపోతుంది. చివరికి అతను చచ్చిపోతాడు. రాజకుమార్తెకి వేరే పెళ్ళవుతుంది.

ఆ సినిమా చూసి సునంద చాలా ఏడ్చింది. "ఆ అమ్మాయి రాజకుమార్తె అవడం వల్లనే కదా అన్ని కష్టాలు!" అనుకుంది.

తరువాత్తరువాత అనిపించేది, ఆ రాజకుమార్తె అతనిని ప్రేమించినట్లే తనూ స్వేచ్ఛని ప్రేమించింది. జీవితాన్ని ప్రేమించింది. అవే తనకి దొరకలేదు. అవును. అందరికీ సునాయాసంగా పుట్టుకతోనే దొరికే జీవితం కూడా తనకి దొరకలేదు. పుట్టింది. అంతే. బ్రతకడం మాత్రం ఎవరికోసమో!

బస్ దిగి, రిక్షా ఎక్కింది సునంద. ఆనందంగా కళ్ళు మూసుకుంటూ అనుకుంది "కానీ ఆ రాజకుమార్తె కోరిక సినిమా అయిపోయేంతవరకూ తీరలేదు. అసలెప్పటికీ తీరదు యింక. అతను చనిపోయాడు. కానీ తనకు.. తనకు.. లేదు, దేవుడు తనమీద అంత నిర్దయ చూపించలేదు.. యిప్పటికైనా తన కోరిక తీరుస్తున్నాడు."

ఇల్లు సమీపిస్తుంటే సునంద మెల్లగా పర్సులోనుండి డబ్బులు తీసుకుంది. తాళంచెవి తీసి చేత్తో పట్టుకుంది. అదే యిల్లు.. ఒకప్పుడు తనకు నరకమనిపించిన ఆ యిల్లే యిపుడు ఆశలతీరంలా.. తనకోసం సృష్టించబడిన

స్వర్గంలా తోస్తుంటే తల ఎత్తి చూసింది.

ఇంటిచుట్టూ వున్న కొబ్బరిచెట్లూ, వీధివాకిలి దగ్గరి గన్నేరు చెట్టూ, తన చేతుల్లో పెరిగిన గులాబీమొక్కలు.. అన్నీ కనిపిస్తున్నాయి. వాటి మధ్యలో తెల్లగా మెరిసిపోతున్న యిల్లు.

ఇంటిముందు.. ఇంటిముందు అరుగుమీద ఎవరది! మసక మసకగా ఏవో ఆకారాలు కనిపిస్తున్నాయి. ఎవరో ముసలాయన ఒంట్లో సత్తువలేనట్లూ వాలిపోతున్నాడు. ప్రక్కనే మరో యువకుడు..

"నమస్కారమమ్మా. నాపేరు గోవింద్" అన్నాడతను సునంద గేటు తెరుచుకుని లోపలికి అడుగు పెట్టగానే.

"ఈయన పేరు శంకరం. చాలారోజులనుంచీ మాయింట్లో వుంటున్నాడు. ఏనాడూ అద్దె యివ్వడు. ఇల్లు ఖాళీచేసి పొమ్మంటే పోడు. పైసా ఆదాయం లేదు. శరీరం చూస్తే రోగాలపుట్ట. నాలుగురోజులనుంచీ శవంలా పడివున్నాడు. పూర్తిగా శవమైతే బయట పారేద్దును. ఏమిటయ్యా మాకీ తద్దినం! అంటే చివరికి ఈ అడ్రస్ చెప్పాడు. అమ్మా! మీకీయన తెలుసు కదా!"

అతని ప్రశ్న సునందకి మొదట అర్థం కాలేదు. అర్థమయిన తర్వాత తలతిప్పి ఆ ముసలాయనని చూసింది. "అవును. అతను శంకరమే. తన భర్త శంకరం..."

ఆమె మొహంలో భావం అర్థం కాగానే అతను కదిలాడు. "మరి నే వెళ్ళొస్తానమ్మా. త్వరగా వెళ్తే లాస్ట్ బస్ అందుతుంది." ఆమె తేరుకునే లోపూ అతను ఆ వీధి దాటాడు.

సునంద స్థాణువులా నిలబడిపోయింది.

"ఏమయింది! ఇపుడు ఏమయింది!" ఆమెకు అసలేమీ అర్థం కావడం లేదు. అటు ఆకాశం.. యిటు భూమి .. మధ్యలో తను. ఊపిరి ఆడక

ఉక్కిరిబిక్కిరి అయిపోతూ తను . . . చలికి వణికిపోతూ తను.

"సునందా!"

విషాదం కన్నా విషాదంగా వున్న ఆ నిశ్శబ్దంలోనుంచీ మెల్లగా వినపడింది శంకరం పిలుపు. సునంద ఉలిక్కిపడి కదిలింది.

గుండెలోతుల్లోనుంచి వెల్లువలా ఎగసిన దుఃఖం బయటకి వచ్చే శక్తిలేక గొంతు వెనకే సుడులు తిరిగింది. ఓదార్పు చెపుతున్నట్లూ ఓ కన్నీటి చుక్క మెల్లగా కంఠం పైకి జారింది.

*****

("ఆంధ్రప్రభ" సచిత్ర వారపత్రిక – 17 నవంబర్ 1993)